నర్సులపై పనిభారం

అందరికీ ఆరోగ్య సేవలందేలా చూడటంలో నర్సుల పాత్ర కీలకమైంది. వ్యాధుల నియంత్రణకు కృషి చేస్తారు. ఆస్పత్రిలో ఒక్కో విభాగానికి ఒక్కో విధంగా నర్సుల సేవలు అవసరం అవుతాయి. ఆపరేషన్ గదులు, అత్యవసర విభాగాల్లో వారు అందించే సేవలు వెలకట్టలేనివి. హిందూపురం జిల్లా ఆస్పత్రిలో నర్సుల కొరత వేధిస్తోంది. రోగుల సంఖ్య, నర్సులపై పని భారం పెరగకుండా ఆస్పత్రిలో నర్సులను నియమించాల్సిన అవసరం ఉంది.

- హిందూపురం జిల్లా ఆస్పత్రిలో నర్సుల కొరత
- ఆస్పత్రిలో విధులు నిర్వరిస్తున్న 29 మంది నర్సులు
- 11 పోస్టులు ఖాళీ
- నైట్ డ్యూటీలతో సతమతం



హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రి



సూపరింటెండెంట్‌కు సమస్యలను విన్నవిస్తున్న నర్సులు

హిందూపురం టౌన్: పటణంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి హిందూపురంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. చుట్టు ప్రక్కల ప్రాంతాలకు ఈ ఆస్పత్రే పెద్ద దిక్కు. జలుబు, విరేచనాలు, జ్వరాలు, ఇతర జబ్బులు ఇలా అనారోగ్యంతో బాధపడే వారు ఆస్పత్రిని ఆశ్రయిస్తారు. ఇక్కడ రోజూ ఓపీ దాదాపు వెయ్యి దాకా ఉంటుంది. ఆస్పత్రిలో చికిత్స పొందే రోగులు 150 మందికి పైగానే ఉంటారు. వీరందరికీ సేవలందించేందుకు 29 మంది నర్సింగ్ సిబ్బంది మాత్రమే ఉన్నారు. దీంతో నర్సులపై తీవ్రంగా పని భారం పడుతోంది. రోగులు అధికంగా ఆస్పత్రికి వస్తున్నా వారికి వైద్యం అందించేందుకు ఇక్కడి సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. కాగా.. ఇప్పటికే పలు సమస్యలను నర్సులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన దాఖలాలు ఉన్నాయి.

ఏడు విభాగాలకు 29 మందే దిక్కు..

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మొత్తం ఏడు విభాగాలు ఉన్నాయి. ఎమర్జెన్సీ వార్డు, జనరల్, సర్జికల్, పీడియాట్రిక్, గైనిక్, మేల్, ఫీమేల్ వార్డులు ఉన్నాయి. అన్ని విభాగాలకు కలిపి ప్రభుత్వ ఆస్పత్రిలో 40 మంది స్టాఫ్‌నర్సు పోస్టులు ఉన్నాయి. అయితే 40 మంది స్టాఫ్‌నర్సులకు గాను 29 మంది మాత్రమే విధులు నిర్వరిస్తున్నారు. 11 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న నర్సులనే ఏడు విభాగాలకు సర్దుబాటు చేస్తున్నారు. ఒక్కొక్క విభాగంలో ఇద్దరు, ముగ్గురు సర్దుకుని పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే చిన్న పిల్లల వార్డులో దాదాపుగా 100 మంది దాకా పిల్లలకు ఒకే నర్సు ఇంజక్షన్లు వేయాల్సి వస్తోంది.

సేవలందించడంలో ఆలస్యం..

ప్రభుత్వ ఆస్పత్రిలో పనిభారం అధికం కావడంతో సిబ్బంది సతమవమవుతున్నారు. వీటికి తోడు రాత్రి పూట డ్యూటీలు ఉండటంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. గతంలో రాత్రి పూట డ్యూటీలు మూడు నెలలకు ఒకసారి ఉండేవి. అయితే ఇప్పుడు రెండు నెలలకు ఒకసారి డ్యూటీలు వేస్తున్నారు. రోజు రోజుకు రోగుల సంఖ్య పెరగడం, సిబ్బంది తక్కువగా ఉండటంతో పనిభారం అధికమైవుతోంది. రోగులకు సేవలందించడంలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. సేవలందించడంలో ఆలస్యం అవుతున్న తరుణంలో రోగులు.. నర్సులతో గొడవ పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుల ఖాళీలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆస్పత్రిలో నర్సులు సైతం సమస్యను నా దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా ఆస్పత్రి కావడంతో పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి రోగులు వస్తున్నారు. రోగుల సంఖ్యగా ఎక్కువగా ఉండటంతో ఉన్న వారిపై భారం పడకుండా చూస్తున్నాం. డ్యూటీలను సర్దుబాటు చేస్తున్నాం. వారి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ లింగన్న, ఆస్పత్రి సూపరింటెండెంట్, హిందూపురం

యానిమేటర్లను తొలగించడం అన్యాయం



సమన్వయకర్త ఈర లక్కప్ప

మడకశిర: యానిమేటర్లను తొలగించడం అన్యాయమని కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పని చేసే చిరు ఉద్యోగులను ఎలాంటి కారణం లేకుండా తొలగించడం అన్యాయమని విరుచుకుపడ్డారు. నియోజకవర్గంలో మహిళా సంఘాల బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేసే యానిమేటర్లను రాజకీయ రంగు పులిమి, అన్యాయంగా తొలగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 80 మంది యానిమేటర్లను తొలగించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, స్థానిక టీడీపీ నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు చేతనైతే ఇచ్చిన హామీలను అమలు చేయాలని సవాల్ చేశారు. యానిమేటర్ల తొలగింపు ప్రక్రియకు స్వస్తి పలకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అరాచక ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

'నాడు–నేడు' పనులు పూర్తి చేయించండి



ఏఆర్‌రొప్పం పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ భాస్కర్

మడకశిరరూరల్: మండలంలోని ఏఆర్ రొప్పం ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పెండింగ్ ఉన్న నాడు–నేడు పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని హెచ్‌ఎంకు సూచించారు. విద్యార్థుల అపార్ ఐడీ నమోదును పూర్తి చేయించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎయిడ్స్ నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, ఫోర్ట్ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎయిడ్స్ వ్యాధిని ఎలా నివారించాలి? ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి? తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఫోర్ట్ సంస్థ మేనేజర్ అశ్వత్థనారాయణ, ఐసీటీసీ కౌన్సిలర్ నరసింహులు, ప్రిన్సిపాల్ సుజాత, ఫోర్ట్ సంస్థ సిబ్బంది లలిత, నాగేశ్వరి, అధ్యాపకుడు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

25న తెప్పోత్సవం

మడకశిర: పట్టణంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ కోనేరులో ఈ నెల 25న సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా తెప్పోత్సవం ఏర్పాటు చేశామన్నారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, దీపారాధన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పిల్లల చదువుపై శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మహేష్

మడకశిర: పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహేష్ కోరారు. గురువారం కళాశాలలో విద్యార్థుల తల్లి దండ్రుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి తల్లిదండ్రుల సహకారం అవసరమన్నారు. పిల్లలు ఇళ్ల వద్ద సమయాన్ని వృథా చేయకుండా చదువుకునేలా చూడాలని కోరారు. పిల్లలు కళాశాలకు సక్రమంగా వెళ్తున్నారా?లేదా? అనే విషయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం అధ్యాపకులు కూడా తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్



ప్రిన్సిపాల్ మద్దిలేటిని సన్మానిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని గుండుమల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి డాక్టరేట్ పొందారు. కర్నూలులో రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్ విభాగంలో ప్రొఫెసర్ సీవీ కృష్ణారెడ్డి పర్యవేణలో మాదీకరణం చేసిన నికెల్–కోబాల్ట్ ఫెర్రట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ప్రిన్సిపాల్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహించిన గ్రామస్తులు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నక్కలగుట్టకాలనీ వద్ద ఓ వానరానికి స్థానికులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. కుక్కల దాడిలో గాయపడి వానరం మృతి చెందింది. గమనించిన కాలనీవాసులు ఆ వానరానికి హిందూ సంప్రదాయం ప్రకారం గుంత తవ్వి పూజలు చేసి, ఖననం చేశారు.

పాఠశాలలో హెల్త్ క్యాంప్

గుడిబండ: మండలంలోని హిరేతుర్పి ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీనివాస్‌నాయక్ చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం తరఫున వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటిలోపం, చర్మ, దంతాలు ఇతరాత్ర పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి రక్త సమూనాలను సేకరించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి



ఆస్పత్రి వద్ద నిరసన తెలుతుపున్న వివిధ సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: పరిగి ఇండియన్ గార్మెంట్స్‌లో విద్యుత్ ప్రమాదంతో మృతి చెందిన శివకుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని ఏఐటీయూసీ, జై భీమ్ భారత్ పార్టీ, ఎంఎస్‌ఎఫ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి వెంటనే కార్మిక చట్టం ప్రకారం న్యాయం చేయాలని కోరారు. కార్మిక శాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడడం జరిగిందన్నారు. అలాగే యాజమాన్యం కూడా స్పందించి బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, జై భీమ్ భారత్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఊటుకూరు నాగరాజు, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవి కుమార్, నాయకులు నౌషాద్, జియా, జిలాన్, నరసప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టిప్పుసుల్తాన్ జయంత్యుత్సవాలు



మాట్లాడుతున్న ఉమర్‌ఫారుఖ్

హిందూపురం: దేశం కోసం షహీద్ టిప్పుసుల్తాన్ ప్రాణ త్యాగం చేశారని టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ కొనియాడారు. గురువారం స్థానిక త్యాగరాజనగర్ ఆటోస్టాండ్ వద్ద టిప్పుసుల్తాన్ జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతృభూమి కోసం షహీద్ టిప్పుసుల్తాన్ ప్రాణాలు అర్పించారన్నారు. హిందువులు, ముస్లింలు ఒకే తల్లి పిల్లల్లా కలిసిమెలిసి జీవనం సాగించాలని తెలిపారు. మత సామరస్యం, పరమత సహనం పాటిస్తూ సోదర భావంతో మెలగాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఎరుకల హక్కుల సంఘ నాయకులు వెంకటరమణ, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మూర్తి, శ్రీధర్, బద్రీ, మౌలానా ఫయాజ్, ముతవల్లీ అన్సార్, రఫీక్, డాక్టర్ బాబా ఫక్రుద్దీన్, ఇస్మాయిల్, అల్లా బకాష్, ఉమర్ ఇమ్రాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న కేటీ శ్రీధర్

పరిగి: స్వయం ఉపాధితో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సేవా మందిరం సంస్థ అధ్యక్షుడు కేటీ శ్రీధర్ తెలిపారు. గ్రామోద్యోగ్ వికాస్ యోజన పథకం ద్వారా నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని గురువారం మండలంలోని సేవామందిరం ఏఎం లింగణ్ణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు ఎలక్ట్రీషియన్‌గా ట్రెనింగ్ పొందిన తర్వాత సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అరుణ, సంస్థ కార్యదర్శి కేటీ సరిత, రిటైర్డ్ ఐటీఐ ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, స్థానిక ఎంపీటీసీ రామాంజనేయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన అవసరం



అమరాపురం: మద్దనకుంటలో మానవహారంగా ఏర్పడిన దృశ్యం

అగళి: పారిశుద్ధ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ యదవేంద్ర సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మరుగు దొడ్లు వాడదాం–పరిసరాలు పరిరక్షిద్దాం, ఆరోగ్యాన్ని రక్షించుకుందాం అంటూ విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పద్మ,మండల రిసోర్స్ కోఆర్డినేటర్ వెంకటేష్ బాబు, ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరాపురం: ప్రతి కుటుంబం తప్పకుండా మరుగు దొడ్లు నిర్మించుకోవాలని పంచాయతీ కార్యదర్శి జీవరత్నం సూచించారు. గురువారం మండలంలోని మద్దనకుంట గ్రామంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని అధికారులు, విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులు అధికారులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేలో మెరిసిన పావగడ విద్యార్థి



మహీధర్‌ను అభినందిస్తున్న దృశ్యం

పావగడ: పట్టణానికి చెందిన నరసింహాచారి, శ్రీవాణి దంపతుల కుమారుడు మహీధర్ కరాటే పోటీల్లో ప్రతిభ చూపాడు. స్థానిక గురుకుల పాఠశాలలో చదువుతున్న 5వ తరగతి విద్యార్థి మహేంద్ర ఇటీవల గౌరీబిదనూరులో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానం సాధించాడు. ఆ బాలుడి విజయంపై పాఠశాల యాజమాన్యం, స్థానిక తుమకూరు వి.వి. సిండికేట్ సభ్యుడు కోర్టు నరసప్ప, హనుమంతరాయప్ప, నరసింహప్ప, నాగరాజు హర్షం ప్రకటించారు.

గిరిజన తండాలు నీ జాగీరు కాదు

- పార్టీ బహిష్కృత నాయకుడు నాగేనాయక్‌కు హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పాలే జయరాంనాయక్

గోరంట్ల: గిరిజన తండాలు నీ జాగీరు కాదు.. ధైర్యముంటే మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌ను తండాల్లోకి అడుగుపెట్టనీయకుండా అడ్డుకో అని గిరిజన సంఘం నాయకులు సవాల్ విసిరారు. మండలంలోని గిరిజనులు 22 వేల మంది నా వెంటే ఉన్నారు.. మాజీ మంత్రి, సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు , పెనుకొండ సమన్వయకర్తను తండాల్లో తిరగకుండా అడ్డుకుంటా అని బహిష్కరణకు గురైన గోరంట్ల సర్పంచు భర్త నాగేనాయక్ వ్యాఖ్యలు చేశాడు. దీనిపై మండలంలోని గిరిజన తండాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, గోరంట్ల జెడ్పీటీసీ సభ్యుడు స్పందించారు. గురువారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి అధ్యక్షతన మండలంలోని వైఎస్సార్‌సీపీ గిరిజన సంఘం నాయకులతో కలిసి జెడ్పీటీసీ పాలే జయరాంనాయక్ విలేకరులతో మాట్లాడారు. గోరంట్ల సర్పంచ్ సరోజబాయి భర్త నాగేనాయక్‌తో పాటు కళ్లగేరి శంకరరెడ్డి, వానవోలు ఉపసర్పంచ్ , పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడంతో ఇటీవల పార్టీ సస్పెండ్ చేసిందన్నారు. అయితే నాగేనాయక్ తన సొంత ప్రయాజనాల కోసం కులాన్ని అడ్డు పెట్టుకోవాలని చూడటం సరికాదన్నారు. నాగేనాయక్ అనే వ్యక్తి ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయానికి పనిచేశాడన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో పదవీ కాంక్షతో వైఎస్సార్‌సీపీలో చేరి, పార్టీ మద్దతుతో భార్యను సర్పంచును చేసుకున్నాడన్నారు. సర్పంచ్ అయిన తర్వాత రూ.కోట్లు అక్రమంగా ఆర్జించాడన్నారు. గతంలో ఏనాడూ గిరిజన సంక్షేమాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ మేదర శంకర, బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, మాజీ వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షులు పోతుల రామకృష్ణారెడ్డి, గోరంట్ల ఉప సర్పంచ్ రాజారెడ్డి, గడ్డం తండా సర్పంచ్ వాసునాయక్, మండలపల్లి ఎంపీటీసీ నాగేనాయక్, పార్టీ సీనియర్ నాయకులు గంపలవెంకటరమణారెడ్డి, బూదిలి వాండ్లపల్లి బయపరెడ్డి, గొనివారిపల్లి, ఆది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించరా?



రసాభాసగా మారిన మండల సర్వసభ్య సమావేశం

పరిగి: గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు కనీసం 10 నుంచి 3 వేల ఓటర్లు తమకు ఓటేసి గెలిపించారని, అధికారక కార్యక్రమాలకు కనీసం సమాచారం ఇవ్వకుండా, ప్రోటోకాల్‌పాటించకపోవడం ఏమిటని సభ్యులు నిలదీశారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ వేదవతి, జెడ్పీటీసీ శ్రీరామప్ప, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అధికారులు అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించకపోవడంపై ప్రశ్నించారు. కొన్ని రోజులుగా గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులను కాకుండా టీడీపీ నాయకులను వేదికపై కూర్చోబెడుతున్నారని, ఇది సరికాదన్నారు. సమావేశంలో సభ్యులకు అధికారులకు తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎస్‌ఐ రంగడుయాదవ్ అక్కడికి చేరుకొని సభ్యులకు నచ్చజెప్పారు.

సమస్యలను పరిష్కరించండి: కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నా చర్యలు తీసుకోలేదని సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. డెలవరీలో అదనంగా రూ.30 నుంచి రూ. 50 వరకు వసూలు చేస్తున్నా పట్టించుకోకపోవడం ఏమిటన్నారు. ప్రతి మండల మీట్‌లోనూ చర్చించిన అంశాలు, సమస్యలను పరిష్కరించడం లేదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, ఎంఈఓ శేషాచలం, ఏఓ విజయభారతి, మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలు మండల శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వృత్తి విద్యా శిక్షణపై అవగాహన

లేపాక్షి: స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ సుందర రాజు తెలిపారు. గురువారం లేపాక్షి గ్రామ సచివాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆధార్ అప్‌డేట్, కుల, ఆదాయంపై వివరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు ప్రత్యక్ష అనుభవాల ద్వారా బోధన చేయడం ఉత్తమ ఫలితాన్ని అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వృత్తి విద్యా శిక్షకుడు రాజు, ఉపాధ్యాయులు సరిత, జయసింహనాయుడు, కేశవానందరెడ్డి పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై ర్యాలీ

లేపాక్షి: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా లేపాక్షిలో ఓరియంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ నరసింహమూర్తి, ఎంఈఓ నాగరాజు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ దివ్య, ఎంసి విజయకుమార్ పాల్గొన్నారు.

ఉన్నత చదువుతోనే బంగారు భవిష్యత్

రొళ్ల: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్ రూపొందించుకోవాలని ఆర్డీటీ ఏటీఎల్ ఓబుళేష్ సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న బాలుర విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై 'బాలల హక్కుల సంరక్షణ' పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆర్డీటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏటీఎల్ మాట్లాడుతు సమాజంలో యువత ఆదర్శంగా నిలవాలన్నారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా జీవితంలో ఓ లక్ష్యాన్ని పెట్టుకుని ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు మహదేవప్ప, సీఓ హనుమంతరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న స్పెయిన్ మిత్ర బృందం

గుడిబండ: సుదూర ప్రాంతాల నుంచి నడుచుకుంటూ వచ్చి విద్యనభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థుల కోసం ఆర్డీటీ ప్రతినిధులు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. గురువారం మండలంలోని మద్దనకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో స్పెయిన్ మిత్ర బృందం చేతులమీదుగా 36 మంది 9, 10వ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఏటీఎల్ మీనాక్షి మాట్లాడుతూ పేదలకు ఆర్డీటీ ఉచితంగా ఇల్లు కట్టించడంతో పాటు విద్య, వైద్య సదుపాయం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జగదాంబ క్రిష్టప్ప, రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైప్‌లైన్‌ను నాశనం చేస్తే చర్యలు

హిందూపురం: సహజవాయివు పైప్‌లైన్‌ను నాశనం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఏజీఅండ్‌పీ ప్రథమ్ సంస్థ ప్రతినిధి సూర్య మాదల తెలిపారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ సాయిబాబా గుడి వెనుక ఇటీవల ఓ ఇంటి యాజమాని డ్రైనేజీ కోసం చేపట్టిన పనుల వల్ల సహజవాయివు పైప్‌లైన్ దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ ప్రాంతంలో గ్యాస్ సరఫరాను వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రతినిధి తెలిపారు. యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసినట్లు పేర్కొన్నారు. అత్యవసరం మేరకు తవ్వకం పనులను ప్రారంభించాలంటే 1800 2022 999 సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లేదా సిటీ మున్సిపల్ అధికారులకు తెలియజేయాలన్నారు.

చట్లపై అవగాహన అవసరం

సోమందేపల్లి: విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ రమేష్ బాబు సూచించారు. గురువారం మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని కేజీబీవీ విద్యార్థులకు పోక్సో, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలున్నా విద్యార్థులు తమ దృష్టికి తీసుకురావాలని ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధి పనుల గుర్తింపు

రొళ్ల: ఉపాధి పనుల ద్వారా శాశ్వతంగా రైతులకు ఉపయోగపడే పనులు కూలీలతో చేయించాలని ఏపీఓ ఓబుళప్ప సూచించారు. గురువారం కాకి, హులికుంట, హొట్టేబెట్ట పంచాయతీ కేంద్రంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం కింద చేపట్టనున్న పనుల ఎంపికపై రైతులు, కూలీలతో గ్రామసభను నిర్వహించారు. కాకి గ్రామసభలో ఏపీఓ మాట్లాడుతు గ్రామాల్లో జాబ్ కార్డులు కలిగిన ప్రతి కూలీకి వంద రోజుల పాటు పని కల్పించి వలసలు నివారించాలన్నారు. అనంతరం ఆయా పంచాయతీ పరిధిలో ఉపాధి ద్వారా చేపట్టనున్న పనుల గురించారు. కార్యక్రమంలో వైఎస్ సర్పంచ్ రాజు, ఈసీ మారేగొడు, కార్యదర్శి రచన పాల్గొన్నారు.

'పురం'లో సినీనటుడు నాగినీడు



హిందూపురం: ప్రముఖ సినీనటుడు వెల్లెం నాగినీడు గురువారం హిందూపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పెనుకొండ సమీపంలోని రాజు మేకలపల్లి వద్ద సుమారు 90 ఎకరాల భూమిలో భవనాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పేద విద్యార్థులకు ఉచితంగా విద్య, ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తాను చేపడుతున్న నిర్మాణం కోసం అవసరమైన వస్తువులను హిందూపురంలో కొనుగోలు చేసినట్లు తెలిపారు.

చేపల పెంపకానికి చెరువుల వేలం

రొళ్ల: మండలంధిలోని కాకి సచివాలయం ఆవరణలో గురువారం కాకి, కే.బ్యాడిగెర చెరువులో చేపల పెంపకానికి వేలం వేసినట్లు పంచాయతీ కార్యదర్శి రచన తెలిపారు. దీంతో రెండు చెరువులను వెంకటేష్ అనే వ్యక్తి దక్కించుకున్నారన్నారు. కాకి చెరువు రూ.25 వేలు కే.బ్యాడిగెర చెరువు రూ.50 వేలు పలికిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ లోకేష్, వైస్ సర్పంచ్ రాజు, నాయకులు బసవరాజు, యర్రగుంటప్ప, వ్యాపారులు పాల్గొన్నారు.